## క్లుప్తంగా

### శుభ్రతపై కళాజాత



అవగాహన కల్పిస్తున్న కళాజాత సభ్యులు

బంగారుపాళెం: మండలంలోని కొదలమడుగు ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం పరిసరాల శుభ్రతపై గుంటూరుకు చెందిన కళాజాత బృందం అవగాహన కల్పించింది. విద్యార్థుల వ్యక్తిగత శుభ్రత, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, అంటువ్యాధుల వ్యాప్తిపై అవగాహన కల్పించారు. హెచ్ఎం రవీంద్రప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### డీఈ కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభం



స్థలాన్ని జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో డివిజన్(డీఈ) కార్యాలయ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. స్థానిక గిరింపేటలో ఉన్న ట్రాన్స్‌కో స్థలంలో నిర్మాణ పనులు చేపట్టారు. అందులో భాగంగా జేసీబీ సాయంతో స్థలాన్ని చదును చేసి, పిల్లర్లు, ట్యాంకుల కోసం భూమిని తవ్వుతున్నారు. డివిజన్, సబ్‌డివిజన్ కార్యాలయాలను భవనంలో నిర్మించనున్నట్లు సివిల్ డీఈ గోవిందరాజులు తెలిపారు. మొత్తం రూ.48 లక్షలతో పనులకు ఆమోదం వచ్చిందన్నారు. మరో 5 నెలల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.

### మాజీ ఎంపీటీసీ మృతి



దేవేంద్రరెడ్డి (ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని తుంబకుప్పం మాజీ ఎంపీటీసీ సభ్యుడు దేవేంద్ర రెడ్డి(51) సోమవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు. దేవేంద్ర రెడ్డి పొలం వద్ద పనులు చేస్తుండగా ఛాతీనొప్పి రావడంతో పొలం వద్దే అపస్మారక స్థితిలో పడిపోయాడు. ఈ విషయాన్ని గుర్తించిన అక్కడే ఉన్న రైతు కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన కుటుంబ సభ్యులు తుంబకుప్పంలోని ఆస్పత్రికి తీసుకువచ్చారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దేవేంద్ర రెడ్డి వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని, ఆయన మృతి బాధాకరమని స్థానిక సర్పంచ్ లీలావతమ్మ, ఎంపీపీ అమరావతి, మాజీ సర్పంచ్ అరుణామల్‌రెడ్డి, సీనియర్ నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.

### ఆరోగ్య పరిరక్షణ అవసరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరిరక్షణ అవసరమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని పేరయ్యగారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 60 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. వేసవి దృష్ట్యా ప్రతి ఒక్కరూ పండ్ల రసాలు, కొబ్బరి నీరు అధికంగా తీసుకోవాలన్నారు. చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చిత్తూరు నగరంలోని 15వ డివిజనల్‌లోని వళ్లియప్ప నగర్‌లో ఉన్న మునిసిపల్ బోరు పరిస్థితి ఇది. దాదాపు వెయ్యికిపైగా కుటుంబాలున్న కాలనీలో మునిసిపల్ నీటిబోరు పని చేసి 20 రోజులు కావస్తోంది. బోరు లోపలున్న మోటారు తీసుకెళ్లిన అధికారులు ఇంకా దాన్ని బిగించలేదు. చివరకు మోటారు సిద్ధమైంది. కానీ స్థానికంగా ఉన్న ఓ టీడీపీ నేత అనుమతిస్తేనే మోటారు బిగిస్తామంటూ ఇక్కడ పనిచేసే కార్పొరేషన్ సిబ్బంది సతాయిస్తున్నారు.



# నగరవాసుల నీటి ఘోష

- పాడైపోయిన బోర్లను పట్టించుకోని అధికార యంత్రాంగం
- నీటి కోసం నెలల తరబడి అవస్థలు పడుతున్న జనం
- మండు వేసవిలో దాహార్తి తీర్చేదెవరు?

చిత్తూరు అర్బన్: చిత్తూరులో ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి. భూగర్భజలాల పరిస్థితి బాగానే ఉన్నప్పటికీ మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన నీటి బోర్లలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించడంలో అధికారుల ఉదాసీన వైఖరి విమర్శలకు దారితీస్తోంది. నగరంలో ప్రజలకు అవసరమైన నీటిని సరఫరా చేయడంలో బోర్లదే అగ్రస్థానం. వీటిలో కొన్ని రిపేర్లకు నోచుకోలేదు. కొన్ని బోర్లకు అదనంగా పైపులు వేస్తే నీరు పుష్కలంగా వస్తుంది. మరికొన్ని బోర్లలో మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. వీటిని రిపేర్లు చేయించడం, పాడైపోయిన మోటర్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయడం చేస్తే సరిపోతుంది. కానీ కార్పొరేషన్‌లోని ఇంజినీరింగ్ విభాగంలోని కొందరు అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. అసలు నగరంలో నీటి సమస్య పరిష్కరించడంలో కీలకంగా వ్యవహరించాల్సిన ఇంజినీరింగ్ అధికారుల్లో నిర్లక్ష్యం నెలకొంది. బోరు, మోటార్లకు చిన్నపాటి మరమ్మతులు చేయించడానికి నెలల తరబడి అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు.

**అద్దె ట్యాంకర్లవైపు మొగ్గు**

నీటి బోర్లను రిపేర్లు చేయించకుండా బోద్యం చూస్తున్న అధికారులు, అద్దె ట్యాంకర్లకు మాత్రం రూ.వేలకు రూ.వేలు బిల్లులు దోచి పెడుతున్నారు. కేవలం కాంట్రాక్టర్ల జేబులు నింపడానికే అన్నట్లు.. నీటి బోర్లు పనిచేయని ప్రాంతాలకు అద్దె ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇది ముమ్మాటికీ ప్రజాధనం దుర్వినియోగం చేయడం తప్ప, ఆదా చేయడం కాదనే విషయాన్ని కార్పొరేషన్ అధికారులు గమనించడం లేదు.

నగరంలోని సంతపేట, వెంగళరావు కాలనీ, కట్టమంచి, తేనబండ, రామ్‌నగర్ కాలనీ, గిరింపేట, ప్రశాంత్ నగర్ కాలనీల్లో బోర్లు రిపేర్లయినా, వాటిని బాగుచేయించలేదు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఇదే అంశాన్ని లేవనెత్తారు. త్వరలోనే కొత్త మోటార్లను బిగిస్తామని హామీ ఇచ్చిన అధికారులు, క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజల సమస్యలను పరిష్కరించడం లేదనే విమర్శలున్నాయి.



18వ డివిజన్ పగడమానువీధి వద్ద ఉన్న సచివాలయానికి ఆనుకుని ఉన్న బోరు పరిస్థితి ఇది. మోటారు పనిచేయలేదని చెప్పిన కార్పొరేషన్ అధికారులు.. రెండు నెలలుగా దీన్ని మరమ్మతు చేయలేదు. అద్దెనీటి ట్యాంకరు ద్వారా నీటిని సరఫరా చేస్తూ కాలం నెట్టుకొస్తున్నారే తప్ప.. కొత్త మోటారు ఏర్పాటు చేయడంపై ఇంజినీరింగ్ అధికారులు దృష్టి సారించడంలేదు.

### పెంచిన గ్యాస్ ధర తగ్గించాలి

చిత్తూరు కార్పొరేషన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా నిరసనలు తెలియజేయనున్నట్లు అందులో పేర్కొన్నారు. గృహావసరాలకు వినియోగించే సిలిండర్లపై రూ.50 పెంచడం దారుణమన్నారు. ఇప్పటికే దేశంలో ప్రజల కొనుగోలు శక్తి పడిపోతున్న దశలో నిత్యావసరాలైన గ్యాస్ ధర పెంచడం ప్రజల నెత్తిన బండ వేయడమేనన్నారు.

### వరసిద్ధునికి విరాళం



నగదు విరాళం అందిస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన నిత్య అన్నదాన ట్రస్టు గోసంరక్షణకు ఓదాత సోమవారం విరాళం అందించారు. హైదరాబాద్‌కు చెందిన రవిశంకర్ అన్నదానానికి రూ. 1లక్ష, గోసంరక్షణ ట్రస్టుకు రూ. 50వేలు అందజేశారు. ఈ విరాళం అందుకున్న ఆలయ ఏఈవో రవీంద్రబాబు దాత కుటుంబసభ్యులకు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందించారు.

## వడదెబ్బ నివారణ పోస్టర్ ఆవిష్కరణ



అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: ప్రజలు వడదెబ్బ తగలకుండా ముందు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో వడదెబ్బ తగలకుండా ముందస్తుగా చేపట్టాల్సిన జాగ్రత్తల అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభంలో ఎండలు ఎక్కువగా ఉంటాయన్నారు. పదేళ్లలోపు పిల్లలు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు ఎండలకు జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లా వైద్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు వడదెబ్బ లక్షణాలు, జాగ్రత్తల పట్ల విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మోహన్ కుమార్, డీఎంహెచ్‌వో సుధారాణి పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ధనలక్ష్మి

ఐరాల: ప్రకృతి వ్యవసాయ పంటల సాగుపై రైతాంగం ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ ధనలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఏఓ ధనలక్ష్మి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల సిబ్బందికి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంతో ఆరోగ్యకర పంటలు చేతికందుతాయని, రైతులను ఆ దిశగా ప్రోత్సహించాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగం వలన పంటలు విషతుల్యమవుతున్నాయని తెలియజేశారు. శిక్షణ పొందుతున్న సిబ్బంది రైతులను ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా చూడాలన్నారు. పంటల సాగుకు ముందు నవధాన్యాలు వెదచల్లుకొని పంటలు సాగు చేయడం వలన భూసారం పెరుగుతుందన్నారు. దేశవాళీ పశువులు ఎరువులు, మూత్రంతో పంటలు పండించి దిగుబడులు పెంచుకోవాలని తెలిపారు. ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ముందస్తుగా ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసి సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అందించే సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. పొలాల్లో ఏడాది పొడవునా పంటలు సాగులో ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. పంట, పంటకు మధ్యలో బీడు లేకుండా భూమిలో నవధాన్యాలు చల్లుకొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలని వివరించారు. ఏపీఎం నాగరత్న మాట్లాడుతూ ఏపీసీఎన్ఎఫ్ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ మహిళా సంఘాల సమన్వయంతో అభివృద్ధి చెందుతుందని, మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలంటే ప్రతి మహిళా ప్రకృతి వ్యవసాయం వైపు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వార్షిక వ్యవసాయ ప్రణాళిక నిర్వహణ కోసం అందరూ సహకరించాలని చెప్పారు. మాస్టర్ ట్రైనర్ హనుమంతు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఎందుకు చేయాలి? ఎటువంటి పద్ధతులు పాటించాలని అనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ మురళీ, ఎన్ఎఫ్ఏ కవిత, యూనిట్ ఇన్‌చార్జ్‌లు భారతి, హైమావతి, ఐసీఆర్‌పీలు యేతేంద్ర, నాగేశ్వర్‌రావు, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఎండల్లో జాగ్రత్తలు తప్పనిసరి





పుణ్యసముద్రంలో సేవలందిస్తున్న డాక్టర్ ప్రియాంక, మల్లకుంటలో సేవలందిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: ఎండలు మండుతున్నందున ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని పుణ్యసముద్రంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక 43 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

**పేదలకు వైద్య సేవలు**

మల్లకుంటలో డాక్టర్ వినయ్‌కుమార్ 35 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. బాలింతలు, గర్భవతులు, చిన్నారులు, వృద్ధులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భిణులు ఆస్పత్రిలో ప్రసవించడం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు, రోగులు, గర్భవతులు పాల్గొన్నారు.

### ఘనంగా కేడయ ఉత్సవం



చిత్తూరు రూరల్(కాణిపాకం): పంగుణి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని శ్రీఅగస్తీశ్వరస్వామి ఆలయంలో సోమవారం కేడయ, ఏనుగు వాహనంపై స్వామి వారు కటాక్షించారు. ఆలయంలోని స్వామివారికి అభిషేక పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం కేడయ వాహనంపై ఊరేగించారు. రాత్రి ఏనుగు వాహనంపై విహరిస్తూ భక్తులకు స్వామి వారు అభయమిచ్చారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో విచారించాలి



వినతులు తీసుకుంటున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజల సమస్యలు, వాళ్లు ఇచ్చే వినతులు, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించాలని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. చిత్తూరు నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఆర్థిక అంశాలతో ముడిపడ్డ వాటిని ప్రాధాన్యత ఆధారంగా గుర్తించాలన్నారు. ఇతర వినతులను తక్షణం పరిశీలించాలని ఆదేశించారు. ఈ గ్రీవెన్స్‌లో మునిసిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, మునిసిపల్ ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. సామాజిక పింఛన్లు, ఇంటి పన్నులు, కాలువలు–రోడ్లకు సంబంధించి పలువురు వినతులు అందజేశారు.

## ఆహార నియమాలతో ఆరోగ్యం పదిలం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

గుడిపాల: ప్రతి ఒక్కరూ మంచి ఆహార నియమాలు పాటించడం, ఒత్తిడిని తగ్గించుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని గుడిపాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సంధ్య అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో భాగంగా మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆహార నియమాలు పాటించకపోవడం, పని ఒత్తిడి కారణంగా ప్రజలు అసంక్రమణ వ్యాధులకు గురవుతున్నారని చెప్పారు. జీవనశైలిని మార్చుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని చెప్పారు. తగినంత నీరు, సమతులాహారం, సరైన నిద్ర, ఒత్తిడిని తగ్గించుకోవడం వంటివి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది బాలసూర్యనారాయణ, విజయ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

### గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

చిత్తూరు అర్బన్: గంజాయి తరలించిన కేసులో పారిపోయిన నిందితుడు వేణు (36)ను చిత్తూరు టూటౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గతేడాది నవంబరులో నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి నిందితులను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనలో తప్పించుకున్న బంగారుపాళ్యంకు చెందిన వేణును ఇపుడు అరెస్టు చేసి, మేజిస్ట్రేట్ ఆదేశాలతో రిమాండుకు తరలించారు.


## ఓపెన్ యూనివర్సిటీ పరీక్షల తనిఖీ



పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షిస్తున్న ఎస్వీ యూనివర్సిటీ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఎస్వీయూ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలను ఉన్నతాధికారులు తనిఖీ చేశారు. సోమవారం ఎస్వీ యూనివర్సిటీకి చెందిన డైరెక్టర్ రమేష్ బాబు, ప్రొఫెసర్ రవినాయుడు ఆకస్మికంగా పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. చూచిరాతలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జీవనజ్యోతి, పీవీకేఎన్ పరీక్షల విభాగం కంట్రోలర్ శరవణ తదితరులు పాల్గొన్నారు.

## కమనీయం.. సీతారాముల పరిణయం



అరగొండలో సింహ వాహనంపై విహరిస్తున్న సీతారామలక్ష్మణులు

తవణంపల్లె: మండలంలోని కె.పట్నంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి సీతారాములు కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కె.పట్నం రాములు గుడిలో సీతారామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చనలు, పూజలు చేశారు. అనంతరం రాత్రిలో సీతారాముల కల్యాణోత్సవాన్ని ఉభయదారులచే అర్చకులు సంప్రదాయ పద్ధతులతో నిర్వహించారు. ఉభయదారులు స్వామికి, అమ్మవారికి పట్టువస్త్రాలు, మంగళసూత్రం, సుగంధపరిమళ పుష్పాలు, గజమాలలు, ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు సీతారాముల వివాహానికి సిద్ధం చేశారు. వేద మంత్రాలు పఠనం చేస్తూ కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మ వారికి సారెలు, పూజలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం ఉదయం సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు.

**సింహ వాహనంపై సీతా రామలక్ష్మణులు**

మండలంలోని అరగొండ కోదండరామాలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని సోమవారం రాత్రి సింహ వాహన సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం సీతారామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అర్చకులు ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. విద్యుద్దీపాలంకరణ, సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించిన సింహ వాహనంపై సీతా రామలక్ష్మణులు విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. భక్తులు స్వామికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం ఉదయం స్వామికి అభిషేకం, పూజలు, రాత్రిలో హనుమంతు వాహన సేవ ఉంటుందని కార్యనిర్వాహకులు తెలిపారు.





కె.పట్నంలో సీతారాముల కల్యాణానికి ఉత్సవర్లను సిద్ధం చేస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు

### వేరుశనగలో మెలకువలపై అవగాహన

గుడిపాల: ఖరీఫ్‌లో రైతులు వరి, వేరుశనగ పంటలో మెలకువలపై రైతులకు వ్యవశాయశాఖ ఏరువాక శాస్త్రవేత్త సంధ్యారాణి సోమవారం అవగాహన కల్పించారు. చిత్తపార, పాపసముద్రం పంచాయతీల్లోని రైతులకు రాబోయే ఖరీఫ్‌లో వరి, వేరుశనగ పంట సాగుతో పాటు ఎటువంటి విత్తనాలు చేసుకోవాలి అన్న అంశాలపై పలు సూచనలు చేశారు. సస్యరక్షణ పంటలు, ముందస్తుగా వేసవి దుక్కులు దున్నడం వలన కలిగే లాభాలపై వివరించారు. ఆమెతో పాటు వ్యవసాయాధికారి మాధవి పాల్గొన్నారు.